క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తొండంగి: మండలంలోని ఒంటిమామిడి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు కారణంగా శనివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఈఈ రత్నాలరావు శుక్రవారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని తొండంగి, కృష్ణాపురం, పి.అగ్రహారం, ఒంటిమామిడి, దానవాయిపేట తదితర గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు, రైతులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

నేడు రహదారి భద్రతపై అవగాహన సదస్సు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో విద్యార్థులకు శనివారం రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు క్యాంపస్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ సదస్సుకు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎ.మోహన్, పెద్దాపురం ఇన్‌చార్జ్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని చెప్పారు.

రేపు నల్లగొండమ్మతల్లి బోనాలు

తుని రూరల్: ఎస్.అన్నవరం శివారు మెట్టవద్ద కొలువైన నల్లగొండమ్మతల్లికి ఈ నెల 22న భక్తులు బోనాలు సమర్పించనున్నారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి తర్వాత వచ్చే ఆదివారం ఎస్.అన్నవరం గ్రామస్తులు నల్లగొండమ్మతల్లికి బోనాలు సమర్పించడం ఆనవాయితీ. దీనిలో ఈ ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించి, తీర్థం నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. అమ్మవారి దర్శనాలకు ప్రత్యేక క్యూలైన్లు, భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

24న మండల బడ్జెట్ సమావేశం

తుని రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 24న వార్షిక బడ్జెట్, సాధారణ సర్వ సభ్య సమావేశాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎస్.సుబ్రహ్మణ్యశర్మ శుక్రవారం తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన సమావేశాలు జరుగుతాయన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్, 2022–23 సంవత్సరపు సవరణ బడ్జెట్‌లను ఆమోదానికి సభ్యుల ముందు ఉంచుతామన్నారు. ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులుగా సర్పంచులు, అన్నిశాఖల అధికారులను ఆహ్వానించినట్టు ఎంపీడీఓ వివరించారు.

రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

ప్రత్తిపాడు రూరల్: మాస శివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని ధారపల్లి ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సనాతన ధర్మ పరిరక్షణ మండలి ఆధ్వర్యంలో పండితుడు చీకట్ల వెంకటేశ్వరరావు స్వామివారికి అష్టోత్తర శతనామావళి, పంచామృత అభిషేకం చేశారు. పెద్దిపాలెం, ఉత్తరకంచి గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పేదలకు రగ్గుల పంపిణీ



పేదలకు రగ్గులు పంపిణీ చేస్తున్న వాకర్స్

తుని: వాకర్స్ ఇంటర్నేషనల్ హెల్త్ క్లబ్ వ్యవస్థాపకుడు సుంకర ఆల్వార్ దాస్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలో పేదలకు రగ్గులు పంపిణీ చేశారు. తొలుత ఆల్వార్ దాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. క్లబ్ ఉన్నతి కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఎలెక్ట్ గవర్నర్ చదరం శివాజీ పేదలకు రగ్గులు పంపిణీ చేశారు. క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు కుందెం సత్యనారాయణ, కార్యదర్శి చోడిశెట్టి బాబూరావు, కండవల్లి జోసెఫ్, పర్వత బాబూరావు, గౌరి శంకర్, ప్రసాద్, శివకుమార్, వేణుగోపాలస్వామి పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాలసుబ్రహ్మణ్యం

కోటనందూరు: మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా తుని తహసీల్దార్ బాలసుబ్రహ్మణ్యం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తొలుత తహసీల్దార్ బాలసుబ్రహ్మణ్యానికి డీటీ కిరణ్‌కుమార్, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు స్వాగతం పలికారు. అనంతరం తహసీల్దార్ ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మతో కలిసి మండలంలోని పలు అంశాలపై చర్చించారు. అనంతరం వీఆర్వోలతో సమావేశం నిర్వహించి భూ పంపిణీలో భాగంగా కొండపోడుభూమి సాగుదారులకు ఈ నెల 23న పట్టాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మండల వీఆర్వో సంఘ అధ్యక్షుడు వేగి సూర్యనారాయణ పాల్గొన్నారు.

కోళ్లఫారంలో చోరీ

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరం గ్రామంలోని కోళ్ల ఫారంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గ్రామంలోని ఎం.రామకృష్ణకు చెందిన కోళ్ల ఫారంలో రెండు కుటుంబాలకు చెందిన భార్య భర్తలు చెల్లారావు, ప్రవల్లిక, మణియ్య, గంగమ్మ నివాసం ఉంటున్నారు. గురువారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని ఆరుగురు వ్యక్తులు కోళ్ల ఫారంలోకి చొరబడి మగవారిని కట్టేసి కొంత నగదును, 50 కోళ్లను అపహరించినట్లు బాధితులు తెలిపారు.

అతివల ఉపాధికి చేయూత

- మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మషాలా సరకుల రీ ప్యాకింగ్
- చేయూత మహిళా మార్టులకు సరఫరా
- తక్కువ ధరకు ప్రజలకు నాణ్యమైన సరకులు



మెషీన్‌తో మషాలా దినుసులు ప్యాకింగ్ చేస్తున్న మహిళలు


మషాలా ప్యాకెట్లను సైజుల వారీగా వేరు చేస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

జగ్గంపేట: మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి మార్గాలు చూపించి తద్వారా వారికి మరింత ఆదాయం సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దానికి అనుగుణంగా మండలాల వారీగా చిన్న పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా జగ్గంపేట మండల మహిళా పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో శ్రీఅమృత స్పైసెస్ పేరుతో ఓ యూనిట్‌ను ప్రారంభించారు. వైఎస్సార్ క్రాంతి పథం అధికారుల పర్యవేక్షణలో కాకినాడ జిల్లాలోనే ప్రప్రథమంగా గత నెలలో జగ్గంపేటలో ఈ యూనిట్‌కు శ్రీకారం చుట్టారు. హోల్‌సేల్ మార్కెట్‌లో నాణ్యమైన సరకును పెద్ద మొత్తంలో కొని దాన్ని శుభ్రం చేసి 100 గ్రాములు, 50 గ్రాములు, 20 గ్రాములు పరిమాణంలో ప్యాకింగ్ చేస్తున్నారు. బయట మార్కెట్‌లో సూపర్ బజారులు, ఇతర కిరాణా షాపుల కన్నా తక్కువ ధరకు ప్రజలకు అందించాలన్నదే ఈ యూనిట్ లక్ష్యమని అధికారులు చెబుతున్నారు. కాగా ఇక్కడ తయారు చేసిన సరకును ముందుగా మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో ఉప్పాడ, తొండంగి గ్రామాల్లో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్టులకు తరలించి విక్రయిస్తున్నారు.

యూనిట్‌కు రూ.5 లక్షలు

శ్రీఅమృత స్పైసెస్ యూనిట్ ఏర్పాటుకు రూ.5 లక్షలు ఖర్చయినట్టు మండల వెలుగు అధికారి జగదీశ్వరి తెలిపారు. హోల్‌సేల్ మార్కెట్ల నుంచి మరో రూ.2.50 లక్షలతో మషాలా దినుసులు కొనుగోలు చేసి ప్యాకింగ్ ప్రారంభించామన్నారు. ఇప్పటి వరకూ 8 వేల ప్యాకెట్లు మార్కెట్‌లోకి పంపి ప్రజలు, వ్యాపార సంస్థల నుంచి వచ్చే స్పందనను తెలుసుకున్నామన్నారు. తాము ఊహించిన దాని కన్నా మంచి రెస్పాన్స్ వచ్చిందన్నారు. దీంతో రోజుకు రెండు వేల ప్యాకెట్లు తయారు చేసి మార్కెట్‌లోకి పంపేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం 14 రకాల మషాలా దినుసులు ప్యాకింగ్ చేస్తున్నట్లు వివరించారు.

ధరల్లో వ్యత్యాసం

మొదటి విడత అమృత స్పైసెస్ ప్యాకెట్లు మార్కెట్లోకి పంపినప్పుడు బయట షాపుల్లో ధరలకు శ్రీఅమృత స్పైసెస్ మషాలా దినుసులు ప్యాకెట్ల ధరలకు భారీగా వ్యత్యాసం కనిపించింది. 100 గ్రాముల ప్యాకెట్‌ను బయట మార్కెట్ కంటే రూ.8 తక్కువ ధరకు అమృత స్పైసెస్‌లో లభిస్తున్నాయి. తక్కువ ధరకు నాణ్యమైన మషాలా దినుసులు లభించడంతో వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. మహిళా సమాఖ్యలోని కొంతమందికి మెషీన్ నిర్వహణపై శిక్షణ ఇచ్చామని, మరికొంత మందికి రెండ విడతలో శిక్షణ ఇస్తామని అధికారులు తెలిపారు.

జిల్లాలోని అన్ని మండలాలకు సరఫరా



ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సహకారంతో జగ్గంపేటలో మషాలా దినుసుల ప్యాకింగ్ యూనిట్ ప్రారంభించాం. ఈ యూనిట్ ద్వారా నెలకు మండల మహిళా సమాఖ్యకు రూ.25 వేల ఆదాయం వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశాం. జిల్లాలో అన్ని మండలాలకు శ్రీ అమృత స్పైసెస్ ప్యాకెట్లు సరఫరా చేయాలని నిర్ణయించాం. ఈ లక్ష్యం చేరుకుంటే మండల సమాఖ్యకు ఆదాయం మరింత పెరుగుతుంది.

– పద్మావతి, ఏరియా కోఆర్డినేటర్, వెలుగు, జగ్గంపేట

ఉత్సాహంగా ముందుకు..



మహిళా సమాఖ్య ద్వారా మషాలా దినుసుల ప్యాకింగ్ యూనిట్ పెట్టిన తరువాత సమాఖ్య సభ్యుల్లో తెలియని ఉత్సాహం నెలకొంది. తాము పంపిన సరకుకు డిమాండ్ పెరగడంతో ఈ పరిశ్రమను మరింత విస్తరించాలన్న ఆసక్తి అందరిలోనూ కలిగింది. మండల సమాఖ్యకు ఆదాయం పెరగడంతో పాటు చాలా మందికి ఉపాధి లభిస్తోంది. అధికారుల సూచన మేరకు మరిన్ని మండలలాకు మషాలా దినుసులు సరఫరా చేయడానికి కృషి చేస్తున్నాం.

– మండెల గంగ, మండల మహిళా సహకార సంఘం అధ్యక్షురాలు, జగ్గంపేట

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ఏలేశ్వరంలో గడపగడపకూ మనప్రభుత్వం


ఏలేశ్వరంలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. ఏలేశ్వరం పట్టణంలో శుక్రవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులతో కలిసి 20వ వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత మూడేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. రోడ్లు, డ్రైన్లు, విద్యుత్, తాగునీరు, వీధి లైట్లు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయన్నారు. భవిష్యత్ మరిన్ని పథకాలు అమలు కావాలంటే ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు కుడుపూడి భరత్, పార్టీ మండల ఇన్‌చార్జ్ బదిరెడ్డి గోవిందు, మున్సిపల్ వైస్ చైర్మన్ మసిరపు బుజ్జి, యండగండి నాగబాబు, మసిరపు నాగేశ్వరరావు, తొండారపు రాంబాబు, మూది నారాయణస్వామి, సామంతుల సూర్యకుమార్, సిరిపరపు రాజేష్, కోరాడప్రసాద్, పైల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి


చిన్నింపేట వద్ద ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ఆదేశించారు. మండలంలోని చిన్నింపేట, పెద్దనాపల్లి, యర్రవరం గ్రామాల్లోని జగనన్న కాలనీలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిపేదవాడికి సొంతిళ్లు ఉండాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో 30 లక్షల మందికి ఇళ్లస్థలాలు మంజూరు చేశారన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు వివరించాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తియ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విశ్వనాథశాస్త్రి, మండల ఇన్‌చార్జ్ బదిరెడ్డి గోవిందు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ


తునిలో రోడ్డు భద్రతపై ర్యాలీ చేస్తున్న పోలీసులు

తుని: రోడ్డు భద్రతను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పట్టణ ఎస్సై గోపాలకృష్ణ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో ఆటోడ్రైవర్లు, మున్సిపల్, పోలీసు సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. రహదారి భద్రతపై నినాదాలు చేశారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఎస్సై గోపాలకృష్ణ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేటప్పుడు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతిఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా వాహనాలు నిలపాలని, కాలం చెల్లిన వాహనాలను వినియోగించకూడదని సూచించారు. పలువురు పోలీస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- ఉప్పలపాడులో గడపగడపకూ మన ప్రభుత్వం


ఉప్పలపాడులో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గండేపల్లి: ప్రభుత్వం అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని ఉప్పలపాడులో శుక్రవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైఎస్ ఎంపీపీ కుంచే రాజా, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కందుల చిట్టిబాబు, కాకినాడ జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ణి వీరబాబు, గ్రామ సర్పంచ్ అడబాల ఆంజనేయులు, ఎంపీటీసీ పిల్లి గన్నమ్మ, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, గండేపల్లి ఉప సర్పంచ్ మద్దిపట్ల రామకృష్ణ కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. ఇంటికే ప్రభుత్వ పథకాలు అందడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. గడిచిన మూడేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతికుటుంబానికి చేకూరిన లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు. గ్రామంలో రహదారులు, డ్రైన్లు, తాగునీరు, విద్యుత్, ఇంటిస్థలాలు, వీధి దీపాలు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అనంతరం ఎస్సీ పేటలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అడబాల రాజు, పార్టీ నాయకులు తోటకూర లక్ష్మణ్, అల్లు విజయకుమార్, గెడ్డ దొరబాబు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కిర్లంపూడి: మాసశివరాత్రిని పురస్కరించుకుని గ్రామ శివారు వనదుర్గమ్మ, జగపతినగరం అభయ దుర్గమ్మ ఆలయాల వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

స్వామివారికి ప్రత్యేక పూజలు

మాసశివరాత్రి సందర్భంగా కృష్ణవరంలో వేంచేసిన విజయేశ్వరవిశ్వనాథ స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రామవరంలో అన్నదానం

జగ్గంపేట: మండలంలోని రామవరం కనకదుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సంక్రాంతి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

హరిదాసుకు సత్కారం


జె.కొత్తూరులో హరిదాసు కృష్ణను సత్కరించిన గ్రామస్తులు

జగ్గంపేట: మండలంలోని జె.కొత్తూరులో హరిదాసు కృష్ణను శుక్రవారం గ్రామ పెద్దలు, యువకులు సత్కరించారు. భద్రాచలానికి చెందిన హరిదాసు కృష్ణ సంక్రాంతి సందర్భంగా జె.కొత్తూరు వచ్చి నెల రోజుల పాటు నగర సంకీర్తన చేశారు. దీంతో గ్రామస్తులు అతడిని పూలమాల, శాలువాతో సత్కరించారు. స్వీట్లు, దుస్తులతో పాటు రూ.21 వేల నగదును పారితోషకంగా అందించారు.

ఉపాధి పనుల పరిశీలన

కోటనందూరు: కోవిడ్ ఫోర్త్‌వేవ్ పట్ల ఉపాధి కూలీలు అప్రమత్తంగా ఉండాలని ఈఓపీఆర్డీ జి.అరుణ్‌కుమార్ సూచించారు. మండలంలోని జగన్నాథపురంలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. మస్తర్లను పరిశీలించి కూలీల హాజరు తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ముందు జాగ్రత్త చర్యగా కూలీలు విధిగా మాస్క్ ధరించాలని, భౌతిక దూరం పాటించాలని సూచించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి ఇంటి పన్ను వసూలుపై పంచాయతీ కార్యదర్శిని ఆరా తీశారు. డ్రై డే–ఫ్రై డే, తాగునీటి క్లోరినేషన్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

కాలువలో పడి వృద్ధుడి మృతి


ఆదినారాయణ మృతదేహం

తుని రూరల్: మండలంలోని హంసవరం సమీపంలో పోలవరం ప్రధాన ఎడమ కాలువలో కాలు జారిపడి వృద్ధుడు మృతి చెందినట్టు రూరల్ ఎస్ఐ ఎ.బాలాజీ శుక్రవారం తెలిపారు. తొండంగి మండలం పైడికొండ గ్రామానికి చెందిన పొన్నగంటి ఆదినారాయణ (63) కాల కృత్యాలకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడి గల్లంతయ్యాడన్నారు. గాలించగా ఆదినారాయణ మృతదేహం లభించిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బాలాజీ వివరించారు.

పారిశుధ్యం మెరుగుకు సహకరించాలి

తుని: పట్టణంలో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు చిరువ్యాపారులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని చిరువ్యాపారులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. పట్టణ వ్యాప్తంగా చిరువ్యాపారులు ఎక్కడికక్కడ చెత్త పడేస్తుండడంతో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారుతున్నాయన్నారు. రోడ్లపై వేసిన వ్యర్థాలను తినేందుకు పశువులు, పందులు రావడంతో వాహనదారుల రాకపోకలకు విఘాతం కలుగుతోందన్నారు. పశువులు, పందులు రోడ్లపై తిష్టవేయడంతో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. షాపుల్లోని చెత్త, వ్యర్థాలను దూరప్రాంతాలకు తరలించాలని వ్యాపారులకు సూచించారు. పట్టణ ఎస్సై గోపాలకృష్ణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


శంఖవరం డ్రైన్లలో పూడికతీత తీస్తున్న పంచాయతీ సిబ్బంది

శంఖవరం: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ సర్పంచ్ బందిలి గనియమ్మ సూచించారు. గ్రామంలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికతీత తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన ప్రసాద్


జిల్లా కలెక్టర్ కృతికాశుక్లాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ ప్రసాద్

కోటనందూరు: రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన మండలంలోని కాకరాపల్లి గ్రామానికి చెందిన లంక ప్రసాద్ శుక్రవారం జిల్లా కలెక్టర్ కృతికాశుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటికే జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా ఉన్న ప్రసాద్ కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్‌తో చర్చించారు. రైతుల నుంచి పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శుక్లా హామీ ఇచ్చినట్టు ప్రసాద్ తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ సలహామండలి మండలాధ్యక్షుడు సుర్ల రాజు ఉన్నారు.

'హిందూ సంగమం' కరపత్రం ఆవిష్కరణ


తునిలో హిందూ సంగమం కరపత్రాన్ని విడుదల చేస్తున్న సంఘ్ ప్రముఖులు

తుని: స్థానిక గణపతి నగర్ చైతన్య కాలేజీ గ్రౌండ్స్‌లో ఆర్ఎస్ఎస్ తుని శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 26న జరిగే హిందూ సంగమం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఖండ్ కార్యవాహ వాడబోయిన దేవివరప్రసాద్ కోరారు. తునిలో శుక్రవారం హిందూ సంగమం కార్యక్రమ కరపత్రాన్ని సహకార్యవాహ వేమవరపు మోహన కృష్ణారావు, ప్రచార ప్రముఖ్ నండూరి కృష్ణ, గ్రామీణ వికాస్ ప్రముఖ్ చదరం నరసింహారావు విడుదల చేశారు. ఈ హిందూ సంగమంలో తుని, తొండంగి, రౌతులపూడి, కోటనందూరు మండలాల నుంచి సంఘ ప్రముఖ్‌లు, సంఘ సేవకులు, హిందూ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహకార్యవాహ జొన్నలగడ్డ బాలఆదిత్య, ఉదయ్ కుమార్, కుందెం సత్యనారాయణ, బూడిది శివతేజ, నానికుమార్ పాల్గొన్నారు.

వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లకు చండీహోమం


రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లకు శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. శుక్రవారం సందర్భంగా వనదుర్గ అమ్మవారికి, కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రం 'మూల'ను పురస్కరించుకుని కనకదుర్గ అమ్మవారికి పండితులు హోమాలు నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. 35 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమాల్లో పాల్గొన్నారు.

అనంతలక్ష్మీసత్యవతీదేవికి అమ్మవారికి లక్ష కుంకుమార్చన : సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలో పండితులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు.

ఒకే భూమి ఇద్దరికి అమ్మిన వ్యక్తికి ఏడాది జైలు

కోటనందూరు: మోసపూరితంగా భూమిని అమ్మిన ముద్దాయికి తుని ఏజేఎఫ్‌సీఎం ఏడాది జైలు, రూ.10 వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ స్వామి నాయుడు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకెళితే.. 2016లో మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన గొర్లి వెంకటరమణ స్థానిక మదర్ కాలేజీ పక్కన గల 2.9 ఎకరాల భూమిని రూ.14.7 లక్షలకు మోసపూరితంగా అమ్మాడు. ఆ భూమిని జగన్నాథపురం గ్రామానికి చెందిన గొర్లి అచ్చియ్య నాయుడు, అనకాపల్లి జిల్లా నాతవరం మండలం ఎంబీపట్నంకు చెందిన గాడి శివవెంకటరమణమూర్తికి అమ్మాడు. ఒకే భూమిని ఇద్దరికీ అమ్మడంతో గాడి శివవెంకటరమణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ శంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. దీనిపై ఎస్.సునీత ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించారు. ఏజేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ ముద్దాయికి పై శిక్ష విధించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


తుని 25వ వార్డులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఏలూరి బాలు

తుని: ప్రజలకు అవసరమై మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు అన్నారు. పట్టణంలోని 25వ వార్డులో శుక్రవారం సాయంత్రం కౌన్సిలర్ పులి సత్యనారాయణ ఆధ్వర్యంలో మన మున్సిపాలిటీ– మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా పర్యటిస్తారని బాలు తెలిపారు. వైఎస్సార్ సీపీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, కమిషనర్ ప్రసాదరాజు పాల్గొన్నారు.

ఆధార్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కోటనందూరు: మండలంలో జరుగుతున్న ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ కోరారు. ఎస్సార్‌పేటలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ సమగ్ర ఆధార్ గుర్తింపు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక ఆధార్ డ్రైవ్‌లు నిర్వహిస్తోందన్నారు. వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం భీమవరపుకోట గ్రామ సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది హాజరు పట్టీ, మూమెంట్ రిజిస్టర్, ఆన్‌లైన్ బయోమెట్రిక్ హాజరును తనిఖీ చేశారు. ఈ–సర్వీస్ రిజిస్టర్, సీఎల్ రిజిస్టర్, సంక్షేమ పథకాల రిపోర్టులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.